సాక్షి శ్రీకాకుళం

గురువారం । 11 । జూలై । 2024



ఆసక్తికరంగా ద్విశతావధానం

అరసవల్లిలో దిశ్వతావధానం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. బులుసు అపర్ణ చక్కగా పద్య పూరణాలు చేశారు. - 8లో



బొరివంకలో తెల్లకప్ప

కవిటి: మండలంలోని బొరివంక ఉన్నత పాఠశాలలో ఆవరణలో తొలిసారిగా ఓ తెల్లకప్ప దర్శనమిచ్చింది. ఇంత వరకూ చూసిన కప్పలకు భిన్నంగా ఉన్న ఈ జీవిని అందరూ ఆశ్చర్యంగా గమనించారు.

రెడ్‌క్రాస్ సమావేశం వాయిదా

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీకి వాయిదా పడిందని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాపూజీ కళామందిర్‌లో జరిగే రెడ్‌క్రాస్ సభ్యులు, పేట్రన్స్, వైస్ పేట్రన్స్, కమిటీ సభ్యులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెబ్ చెక్ పోస్టు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నారు. అనంతరం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించగా పోలీసులు సీజ్ చేశారు. స్థానికంగా నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఈ లారీని పట్టుకున్నారు. సెబ్ అధికారుల సూచన మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మానవత్వం పరిమళించిన వేళ..



మృతదేహాన్ని ఖననం చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: మందస మండలం కొర్రాయిగేటు వద్ద ముకేష్ అనే మతిస్థిమితం లేని అనాథ వ్యక్తి మృతిచెందడంతో పోలీసులే అంత్యక్రియలు నిర్వహించి స్ఫూర్తిగా నిలిచారు. మందస ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్‌ఐ శేఖర్, హెచ్‌సీ జనార్దన తదితరులు మృతదేహాన్ని ఖననం చేశారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు, కార్పొరేట్‌కు అనుకూల విధానాలు వీడే వరకు ఐక్యపోరాటాలు తప్పవని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా నరసన్నపేటలో బుధవారం అంగన్‌వాడీలు ఎంపీడీఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పి.రోహిణి, ఆర్.ఉష, బి.సూర్యకళ, ఎస్.అమ్మన్న, రాధ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సాగర్ కవచ్



పెద్దగనగళ్లపేట బీచ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మెరైన్ సీఐ నారీమణి

గార: సముద్ర తీరప్రాంతం గుండా అనుమానితులు చొరబడకుండా సంయుక్తంగా నిర్వహించే గస్తీ బుధవారం నుంచి రెండు రోజుల పాటు ప్రారంభమైంది. మెరైన్, సివిల్, కోస్టుగార్డు సంయుక్తంగా తీర ప్రాంతం, రోడ్డు, సముద్రంలోనూ గస్తీ చేపట్టారు. గార మండలం వాడాడ, శ్రీకూర్మం జంక్షన్, కళింగపట్నంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు. మొగదాలపాడు, శ్రీకూర్మం, బందరువానిపేట ప్రాంతాల్లో ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు తనిఖీ నిర్వహించగా, ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ ఆయన వెంట ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగళ్లపేట, కె. మత్స్యలేశం ప్రాంతాల్లో మెరైన్ సీఐ నారీమణి తనిఖీలు నిర్వహించారు.



సామాన్యుల కంట్లో ఇసుక

బుచ్చిపేట వద్ద ఇసుక నిల్వలు

- ట్రాక్టర్ లోడ్ కోసం రేయింబవళ్లు పడిగాపులు
- మంత్రి పేరుతో తరలిపోతున్న ఇసుక
- పాలకపక్షానికి ఒక రూలు.. సామాన్యులకు మరో రూలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు



వంశధార నదిలోనికి వెళ్తున్న ట్రాక్టర్

సార్వత్రిక ఎన్నికలు మొదలుకొని ఇప్పటి వరకూ ఇసుక లభ్యత కానరాకపోగా అధికారం అండతో జిల్లా మంత్రి వర్గీయులు మాత్రం ఇసుకను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. తమ సొంత అవసరాలు అని చెప్పి భారీగా డంప్ చేస్తున్నారు. దీంతో సామాన్యులకు ఇసుక అందని పరిస్థితి నెలకొంది. ఉచిత ఇసుక విధానం అంటున్నా స్టాక్ పాయింట్లు వద్ద మాత్రం డబ్బులు వసూలు చేస్తుండటంతో అందరూ విస్తుపోతున్నారు. బుధ వారం నరసన్నపేట మండలం మడపాం ఇసుక ర్యాంపు నుంచి నిమ్మాడకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. మంత్రి అచ్చెన్నాయుడి మనుషులమని చెప్పి ఉదయం నుంచి సాయంత్రం వరకూ 50 పైగా ట్రాక్టర్ల మేర మొత్తం 300 మెట్రిక్ టన్నుల ఇసుక తరలించారు. ఇంత బహిరంగంగా జాతీయ రహదారిపై ఎటువంటి రసీదులు లేకుండా ఇసుక తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మడపాం నుంచి నిమ్మాడ వరకూ జాతీయ రహదారి పొడవునా ఇసుక ట్రాక్టర్లు చూసి అందరూ నివ్వెరపోతున్నారు. మంత్రికి ఒక రూలు.. సామాన్యునికి ఒక రూలా అని కొందరు మండి పడుతున్నారు. ఇంత పబ్లిక్‌గా ఇసుక అక్రమంగా తరలించినా ఎవరూ పట్టించుకోక పోవడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనిలో పనిగా ట్రాక్టర్ల యజమానులు తమ సొంతానికి కొన్ని లోడులు వేసుకున్నట్లు తెలుస్తోంది.

● మంత్రి అచ్చెన్న పేరిట ఇసుక అక్రమ రవాణా

బుచ్చిపేట, లుకలాంలో ఇసుక డంప్‌లు..

ఇసుకకు రోజురోజుకూ కొరత పెరుగుతుండటంతో ఇదే అదునుగా టీడీపీ శ్రేణులు ప్రభుత్వ స్థలాల్లో పెద్ద ఎత్తున డంపు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నరసన్నపేట మండలం బుచ్చిపేట వద్ద వంశధార నదికి వెళ్లే దారిలో వందల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేశారు. లుకలాంలో డీపీఈపీ స్కూల్ ఆవరణతో పాటు నదికి వెళ్లే మార్గాల్లో 50 పైగా మెట్రిక్ టన్నుల ఇసుక అనధికారికంగా నిల్వ చేశారు. దీనిని రాత్రి సమయాల్లో తరలించి ట్రాక్టర్ ఇసుక రూ.4,500 నుంచి రూ.5 వేల వరకూ విక్రయాలు చేస్తున్నారు. లారీల్లో లోడు చేసి విశాఖకు తరలించి అమ్ముకుంటున్నారు. గోపాలపెంట నుంచి ఇసుక అక్రమ తరలింపు జరుగుతోంది. –నరసన్నపేట

● రోజంతా నిరీక్షణే

ఉచితంగా ఇసుక అన్నారు.. ఇప్పుడు డబ్బులకు అమ్ముతున్నారు.. అది కూడా రేయింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది.. అంటూ ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రెండు రోజులు పడిగాపులు కాస్తే తప్ప ఒక లోడ్ ఇసుక దక్కని పరిస్థితి నెలకొంది. సాయంత్రం 6 గంటలకు ఒక్క సెకను కూడా దాటనీయకుండా సిబ్బంది ఇసుక అమ్మకాలను నిలిపివేస్తుండడంతో, అప్పటి వరకు ఇసుక కోసం ట్రాక్టర్లతో నిరీక్షించిన యజమానులంతా ఉసూరుమంటున్నారు. రెండు రోజులుగా అవస్థలు పడుతున్నా అధికారుల్లో చలనం లేదంటూ ఆగ్రహిస్తున్నారు. వివరాలు నమోదు చేసిన చోట ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండడంతో అక్కడ తీవ్ర జాప్యం జరుగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకే అమ్మకాలు నిలిపివేయడంతో యథావిధిగా వందల సంఖ్యలో ట్రాక్టర్ల యజమానులకు నిరాశ తప్పలేదు. కొంత మంది వాహనాలతో తిరిగి వెళ్లిపోగా, మరి కొందరు వాహనాలు విడిచి రాత్రి వేళ అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. –టెక్కలి



టెక్కలిలో సాయంత్రం 6 గంటలకు మూసివేసిన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు



సర్కారు నోట్లో మట్టి

- పంట భూముల నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న టీడీపీ నాయకులు
- అనుమతులు లేకుండా వెంచర్ల ఏర్పాటు

ఒక పక్క అధికార పార్టీ ఉచితం ముసుగులో సామాన్యుల కంట్లో ఇసుక కొడుతుంటే.. మరోపక్క అదే పార్టీ నాయకులు సర్కారు నోట్లో మట్టి కొట్టి పంట భూములను ప్లాట్లుగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల కనుసన్నల్లోనే ఈ దందాలను వారి అనుచరగణాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నాయి. మంత్రి పేరు చెప్పుకొని టీడీపీ వారే వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలించి ప్రైవేటు స్టాక్ పాయింట్లు పెట్టి అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పంటభూముల్లో ఇష్టానుసారం మట్టి తవ్వి అమ్ముకోవడంతోపాటు ఆ భూములను నాలా పన్ను చెల్లించకుండానే రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి సొమ్ములతో జేబులు నింపుకొంటున్నారు.

ఇచ్ఛాపురం రూరల్:

మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు టీడీపీ నాయకులు పంట పొలాల చదును పేరుతో అక్రమ మార్గంలో మట్టి తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇచ్ఛాపురం మండలంలోని ధర్మపురం, తులసిగాం, హరిపురం, లొద్దపుట్టి, ఈదుపురం పంచాయతీ ప్రాంతాల్లో గట్టు చప్పుడు కాకుండా పంట భూములను తవ్వేసి ప్లాట్లు వేసుకుంటున్నారు.

అనుమతులు లేకుండానే..

పచ్చని పంట పొలాల్లో పాగా వేసి నాలా కన్వర్షన్ చేసుకోకుండా, స్థానిక సంస్థల అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ కొందరు ప్లాట్లు వేస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజించాలంటే తొలుత తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయేతర భూమిగా (నాలా కన్వర్షన్) చేసుకోవాలి. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎకరాలు, గుంటల్లో ఉన్న భూమిని చదరపు గజాలు, చదరపు మీటర్లలోకి మార్చుకోవాలి. అక్కడ అనుమతి వచ్చాకే వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలి. లేఅవుట్ మ్యాప్‌లో సూచించిన ప్రకారం స్థానిక సంస్థకు పది శాతం ఖాళీ స్థలం ఇవ్వాలి. 30 అడుగుల రోడ్లు, సైడ్ కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మొక్కలు నాటాలి. మండలంలో ఈ నిబంధనలు ఎక్కడా కానరావడం లేదు. అక్రమ వెంచర్ల మూలంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాక కొనుగోలు చేసిన వారు సైతం మోసపోతున్నారు.

● రవాణా చార్జీల భారం

ఉచిత ఇసుక విధానం పేరిట కూటమి నాయకులు మోసం చేశారంటూ భవన నిర్మాణదారులు మండిపడుతున్నారు. రవాణా చార్జీలు కూడా తడిసిమోపెడై గతంలో కంటే ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు మండలం అంగూరు స్టాక్ పాయింట్ వద్ద ప్రభుత్వం ఇసుక విక్రయాలు ప్రారంభించింది. టన్ను ఇసుకకు ధర రూ.340 చెల్లించాలని బ్యానర్లు కట్టి మరీ వసూలు చేస్తుంటే ఉచిత ఇసుక ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో అయితే ఆయా మండలాల్లో ఇసుక ర్యాంపులో ఉండేవి. ప్రస్తుతం ఇసుక ర్యాంపులు లేకపోవడంతో అంగూరు ఇసుక పాయింట్‌కు రావాల్సి వస్తోందని, ఒక్కో వినియోగారుడుపైనా ట్రాక్టర్‌కు రూ. 2 వేలు పైబడి రవాణా భారం పడుతోందని అంటున్నారు. - కొత్తూరు

చర్యలు చేపడతాం



మట్టి అక్రమ తవ్వకాలు, పంట పొలాల్లో నాలా కన్వర్షన్ లేకుండా ప్లాట్లు వేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ధర్మపురంలో అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు అందాయి. ఇప్పటికే వారిని పిలిపించాం. తవ్వకాలు ఆపకపోతే వాహనాలు సీజ్ చేస్తాం. అనధికారికంగా వేసే ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావొద్దు. - ఎం.భాస్కర అప్పారావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం మండలం

అంతా మా ఇష్టం..

అక్రమ మట్టి తవ్వకాల్లో తెలుగుదేశం నాయకులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ధర్మపురం రహదారి పక్కన స్థానిక టీడీపీ నాయకుడు అక్రమంగా జేసీబీలు ద్వారా మట్టి తవ్వకాలు చేపట్టి సుమారు రెండు ఎకరాల్లో ప్లాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మట్టి తవ్వకాలు, తరలింపుపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ప్రయోజనం ఉండటం లేదు. 'అధికారంలోకి వచ్చాం... అంతా మా ఇష్టం' అన్నట్లు వ్యవహరిస్తున్నారని, తామేమీ చేయలేకపోతున్నామని ఓ రెవెన్యూ ఉద్యోగి వాపోవడం గమనార్హం.



ధర్మపురం జగనన్న కాలనీకి ఎదురుగా మట్టిని డంపింగ్ చేస్తున్న దృశ్యం



తులసిగాం వద్ద అనధికార ప్లాట్లు

మూలపేట పోర్టును పరిశీలించిన కలెక్టర్

సంతబొమ్మాళి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం మూలపేట పోర్టును పరిశీలించారు. ఇంత వరకు జరిగిన పనులు, పోర్టు స్థితిగతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విశ్వసముద్ర కంపెనీ ప్రతినిధులు, పోర్టు అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. భూములు కోల్పోయిన బాధితులు, జిరాయితీ భూముల పరిహారం చెల్లింపు, భూసేకరణ డిమాండ్లు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోర్టులో నిర్మిస్తున్న సౌత్‌బ్రేక్ వాటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమల్, సంతబొమ్మాళి తహసీల్దార్ జి.సత్యనారాయణ, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

● రామావతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రామావవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. - శ్రీకాకుళం కల్చరల్



● శాకంబరీదేవిగా కొత్తమ్మ తల్లి

ఆషాఢమాసం తొలి గురువారం పురస్కరించుకుని కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లిని బుధవారం శాకంబరీదేవిగా అలంకరించారు. అర్చకులు కమ్మకట్టు రాజేష్ పలు రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ పర్యవేక్షించారు. –కోటబొమ్మాళి



క్లుప్తంగా

స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా భాస్కర్



భాస్కర్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.భాస్కర్‌ను స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా నియమిస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఈయన బాధ్యతల్లో కొనసాగుతారు. వర్సిటీలో క్రీడల ప్రగతికి కృషిచేయనున్నట్లు భాస్కర్ చెప్పారు.

వర్సిటీలో పాలనా బాధ్యతలు అప్పగింత

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన అంతర్గత నియామకాలను వైస్ చాన్సలర్ కె.ఆర్. రజిని బుధవారం చేపట్టారు. ఈ మేరకు రిజిస్ట్రార్ పి.సుజాత ఉత్తర్వులు జారీచేశారు. వర్సిటీ కౌన్సెలింగ్ కో–ఆర్డినేటర్‌గా జేఎల్ సంధ్యారాణి, ఏపీఎస్ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్‌గా కె.విద్యాసాగర్, కాన్ఫిడెన్షియల్, రీవాల్యూషన్ అసిస్టెంట్ డీన్‌గా జి.రామకృష్ణ, ట్రాన్స్‌ఫోర్టు అసిస్టెంట్ డీన్‌గా ఎల్.విజయ్‌కుమార్, స్పోర్ట్సు కార్యాలయం కార్యదర్శిగా భాస్కర్, ఏఐసీటీఈ నోడల్ అధికారిగా బి.వ్యాసగీత, పూర్వపు విద్యార్థుల వ్యవహారాల కోఆర్డినేటర్‌గా కె.ఉదయ్‌కిరణ్, సాంస్కృతిక వ్యవహారాల డీన్‌గా పి.రవికుమార్‌లను నియమించారు.

సారాబట్టీలు ధ్వంసం

కాశీబుగ్గ : సోంపేట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది కలిసి మందస మండలం కరియాపల్లిలో సారాబట్టీలపై దాడి చేశారు. అప్పటికే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలపై సమాచారం తెలిస్తే 9440902358 నంబర్‌కు తెలియజేయాలని జైభీమ్ కోరారు. ఈ గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సెబ్ సిబ్బంది కాంతారావు, యోగేశ్వరరావు, భాను ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 23 నుంచి 27 వరకు పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ జగన్నాథ మందిరం ప్రతినిధి లక్ష్మీపతి గౌరదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులో ఉన్న ఆనందమయి కన్వెన్షన్ హాల్ వేదికగా వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం (రామాయణ, భారత, భాగవతం, నైతికవిలువలు తదితర అంశాలు), సంప్రదాయ వేషధారణ (రామాయణ, మహాభారత, కృష్ణలీల) పోటీలు జరుగుతాయని వివరించారు. గ్రూప్–ఏ (6–8 తరగతులు), గ్రూప్–బీ (9,10 తరగతులు) విభాగాలలో ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు వరకు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7799747511, 9492764710 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వరి ఎద సాగులో..

కలుపు కలకలం!

- ముందుగా మేల్కోకపోతే ముప్పు తప్పదు
- చీడపీడలకు సమర్థంగా ఎదుర్కోనాలి
- రైతులకు వ్యవసాయధికారుల సూచనలు



వరి ఎద పంటపొలాలు

ఆమదాలవలస : వరి సాగులో కలుపు ప్రధాన సమస్యగా మారుతోంది. ముఖ్యంగా ఎద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణపై ప్రత్యేక దృష్టి సారించకపోతే నష్టం తప్పదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కలుపు మొక్కలు ప్రధానంగా వరిపంట పొడి ఎద సాగులో 35–45 శాతం, తడి (దమ్ము పట్టి) ఎద సాగులో 20–25 శాతం, నాట్లు వేసే పద్ధతిలో 10–15 శాతం మేర దిగుబడిని తగ్గిస్తాయి. చీడపీడలకు ఆవాసంగా మారి వాటి ఉధృతి ఎక్కువ కావడానికి దోహదం చేస్తాయి. పంట కోత సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. నీటి, వాయు కాలుష్యానికి కారకాలుగా మారుతాయి. వరి పైరు సాగులో వివిధ రకాల గడ్డి జాతి, వెడల్పాకు జాతి కలుపు మొక్కలు ఆశించి పంట పెరుగుదలను నష్టం కలిగించడాన్ని రైతులు చూస్తున్నారు. కలుపు నివారణకు వివిధ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచనలిస్తున్నారు. జిల్లాలో 1.70 లక్షల హెక్టార్ల వరిసాగు విస్తీర్ణం జరుగుతుండగా, తగిన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే కలుపు నివారించుకోవచ్చునని తెలిపారు.

కలుపు రాకముందు నివారణ..

అన్ని రకాల కలుపు మొక్కల నివారణకు విత్తిన 2–3 రోజుల్లో ప్రీటిలాక్లోర్ (ఏరేజ్, చెక్, పైలెట్, రిఫిట్, రేసర్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి ఎకరానికి లీటరు మందును లేదా అక్సాడయార్జిల్ 35 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. మొదట తేమ శాతం సరిగా లేనప్పుడు 5–7 రోజుల్లో, తేమ లభ్యమైనప్పుడు పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ (సాతి అని మార్కెట్‌లో దొరుకుతుంది) రసాయన మందును ఎకరానికి 80 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.




మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

కలుపు వస్తే..

- కలుపు వయస్సు 20–25 రోజుల (2–4 ఆకుల దశ)లో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు పనిచేస్తాయి. కలుపు జాతుల రకాల ఆధారంగా వాటి దశను అనుసరించి కలుపు మందులు ఎంచుకోవాలి. ఊద ఎక్కువగా ఉంటే 15–20 రోజుల సమయంలో సైహెలో ఫాప్ బుటైల్ (క్లించర్, రాప్ అప్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందును 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి ఎకరానికి 400 మిల్లీ లీటర్లు మందును తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- గడ్డి జాతులు, వెడల్పు ఆకు జాతి కలుపును నివారించేందుకు 8–25 రోజుల వ్యవధిలో (2–4 ఆకుల దశ) బిస్పైరీబాక్ సోడియం (నామినీ గోల్డ్, తాకర్, అడోరా వంటి రకాలు మార్కెట్‌లో ఉంటుంది) ఎకరానికి 100 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేసి 4–5 రోజుల తర్వాత పలుచగా నీటిని వదిలే కలుపు చనిపోతుంది.
- ఆరిక గడ్డి, పూతిక గడ్డి, చిప్పెర, గుంపుల గడ్డి, తుంగ, మొండి గడ్డి జాతులు ఉన్నప్పుడు 20–25 రోజుల సమయంలో ఫెనాక్సి ప్రోప్–పి–ఈథైల్ (రైస్ స్టార్ 6.7 శాతం లేదా విప్ సూపర్ 9.3 శాతం) 250 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు ఎకరాకు పిచికారీ చేసి 4–5 రోజుల తరువాత పలుచగా నీటిని పెడితే వారం రోజుల్లో కలుపు చనిపోతుంది.
- మొండి గడ్డి జాతులతో పాటు వెడల్పు ఆకు జాతి కూర గడ్డి ఉంటే మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరాకు 8 గ్రాములు కలుపుకుని ఇథాక్సి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములకు కలిపి పిచికారీ చేయాలి.
- పొలంలో వెడల్పు కూర గడ్డి జాతి కలుపు ఉంటే 25–30 రోజుల సమయం వరకు 2.4 డి సోడియం సాల్ట్‌ను 400 గ్రాములు/మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరాకు 8 గ్రాములు కలుపుకోవాలి. ఇథాక్సి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- పొలంలో వెడల్పాకు కూర గడ్డి జాతి కలుపు, తుంగ మాత్రమే ఉంటే 25–30 రోజుల సమయం వరకు 2.4డి అమైన్ సాల్ట్‌ను 400 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

ఉద్యోగాల పేరిట రూ.7.47 లక్షలకు టోకరా

- లొహరిబంద పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు



పంచాయతీ కార్యదర్శి సతీష్‌బాబుకు కలెక్టర్ జారీ చేసిన నోటీసు

శ్రీకాకుళం క్రైమ్ : ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి జిల్లాకేంద్రంలోని పలువురు నిరుద్యోగుల నుంచి ఓ ప్రభుత్వ పంచాయతీ కార్యదర్శి సుమారు రూ.7.47 లక్షలకు టోకరా వేశాడు. బాధితులు బుధవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో గతంలో ఆయన చేసిన మోసాలు వెలుగులోకి వచ్చాయి. బాధితులు, ఒకటో పట్టణ పోలీసులు, పంచాయతీ శాఖాధికారులు తెలిపిన వివరాల మేరకు.. మందస మండలం లొహరిబంద గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న మన్నం సతీష్‌బాబుకు శ్రీకాకుళంలోని శ్రీనివాసనగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌తో కొంతకాలంగా పరిచయముంది. ఈ క్రమంలో తనకు ప్రభుత్వం నుంచి వాహనం ఇప్పిస్తానని చెప్పి రూ.1.36 లక్షలు ఏడాదిక్రితం తీసుకున్నాడు. అంతేకాక గౌరీ శంకర్ కుమారుడు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడని తెలుసుకున్న సతీష్‌బాబు తనకు చాలా పరిచయాలనున్నాయని నమ్మబలికాడు. గౌరీశంకర్ కుమారునికి ప్రభుత్వోద్యోగం ఇప్పిస్తామని చెప్పి మరో రూ. లక్ష తీసుకున్నాడు. ఎప్పటికీ తనకు ఇస్తానన్న కారు ఇప్పించకపోగా కుమారునికీ ఉద్యోగం కూడా రాకపోవడంతో గౌరీశంకర్ సతీష్‌బాబుని నిలదీశాడు. సమాధానం దాటవేయడంతో చేసేదేమీ లేక బుధవారం ఒకటో పట్టణ పోలీసులను తనకు న్యాయం చేయాలంటూ గౌరీశంకర్ ఆశ్రయించాడు.

గతంలోని మోసాలు..

సతీష్‌బాబుపై గతంలోనూ ఇదే తరహా మోసాల్లో ఇదే పీఎస్‌లో రెండు కేసులు నమోదు కావడం విశేషం. ఇండియన్ బ్యాంకులో మెసెంజర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నగరంలో క్రిష్టియన్ కాలనీలో నివసిస్తున్న పిల్లా నరేష్ అనే యువకుడి వద్ద నుంచి రూ. 5,11,39 తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతేడాది అక్టోబర్ 30 నుంచి ఈ ఏడాది జనవరి వరకు దశలవారీగా ఫోన్‌పే చేసినట్లు ఆధారాలున్నాయి. ఎప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో బాధితుడు నరేష్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేయాలని ఈ నెల 1న జిల్లా పంచాయతీ శాఖాధికారి (డీపీవో)కి కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మందస ఎంపీడీవో ద్వారా పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న శాఖాపరమైన విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఇదే పంచాయతీ కార్యదర్శి గతంలో సరుబుజ్జిలిలో పనిచేసినప్పుడు ఏసీబీకి పట్టుబడ్డాడు.

ఆసక్తికరంగా ద్విశతావధానం



అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో స్థానిక వైజయంతి ఉత్సవ మండపంలో ద్విశతావధాన కళావిలాస కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అవధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ తెలుగు భాషకు వన్నె తెచ్చిన సాహిత్య ప్రక్రియ అవధానమని పేర్కొన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, విశ్రాంత రిజిస్ట్రార్ గుంట తులసీరావు, వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి వరం అవధానమని చెప్పారు.

ఆకట్టుకున్న సాహిత్య ప్రక్రియలు..

సభా సంచాలకులు విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్, సభాధ్యక్షుడు విజయవాడకు చెందిన పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌లు మాట్లాడుతూ అవధాన ప్రక్రియను మొదటిగా మాడభూషి వెంకటాచార్యులు ప్రవేశపెట్టారని, తదుపరి తిరుపతి వెంకట కవులు కొనసాగించారని తెలిపారు. అప్రస్తుత ప్రసంగీకులుగా విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభోట్ల దత్తాత్రేయ శర్మలు పలు అప్రస్తుత సమస్యలను చెబుతూ సమాధానాలు రాబట్టారు. పైడి హరనాథరావు 'దంష్ట్రాఘాతం నేలకొరిగెన్' అని, సుసరాపు చంద్రశేఖరశర్మ 'కొండయున్నది భానుని కొలనులోన' అని, కర్నేన జనార్దనరావు 'మునిఘాతంబున జచ్చె రాక్షసుడు సమ్మోదంబుగా' వంటి సమస్యాపూరణాలను ఇవ్వగా అవధాని పూరణ చేశారు. దత్తపదిలో కె.వి.రాజారావు లతిక, గీతిక, వీచిక, వేదిక పదాలతో అస్సాం వరదలలో పడవలో ప్రసవించిన ఓ గర్భిణి దుస్థితిని పద్యంగా చెప్పమని.. తమ్మినేని సూర్యనారాయణ ధనము, జనము, వనము, దినము అనే పదాలతో పర్యావరణ పరిరక్షణ కోసం చెప్పమనగా ఒక్కో పాదం చక్కగా పూరించారు. మొత్తం 25 మంది దత్తపదులను ఇచ్చారు. సాయంత్రం 25 వర్ణనలకు అవధాని పద్యరూపంలో సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, నీరజ సుబ్రహ్మణ్యం, కె.సురేష్, మురళీధర్, బంకుపల్లి శంకరం, పూజ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో పరిశుభ్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో పరిసరాలు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యా శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల ఆవరణ, తరగతి గదులు, సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి చెత్తా లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాల్లో పేద పిల్లలకు విద్యా పథకాలను అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన రెడ్డి, బీసీ సంక్షేమాధికారి బి.అనురాధ, డీసీఓ బాలాజీ నాయక్, ఏసీఈ లియాఖత్ అలీఖాన్, ఏపీసీ జయప్రకాశ్, ఆర్ఐఓ దుర్గా రావు, డీవీఓ తవిటి నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చక్రధరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న దృశ్యం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి : వంశధార రిజర్వాయర్ పరిశీలనకు మంగళవారం వెళ్లిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తిరుగు ప్రయాణంలో సరుబుజ్జిలి మండలకేంద్రంలో రహదారికి ఇరువైపులా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఎం.రత్నంతో ఫోన్లో మాట్లాడి మండిపడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం అన్ని సచివాలయాల కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. చెత్తకుప్పలు, కార్యాలయాల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించారు.

ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని కొండభీంపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎం.జనార్దన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొండ భీంపురం గ్రామానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తి రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా నర్సిపురం గ్రామానికి చెందిన చుక్క రామారావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో జనార్దన్‌కు గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.మెళియాపుట్టి మండలం ఎగువ బందపల్లికి చెందిన చందనగిరి రమేష్ టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా టెక్కలి మండలం గూడేం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తాపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. టెక్కలి ఏఎస్ఐ నర్సింహమూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

79 మందికి ఉద్యోగాలు



నియామక పత్రం అందజేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో బుధవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 79 మంది ఎంపికయ్యారు. 8 కంపెనీల్లో ఉద్యోగాలకు మొత్తం 116 మంది హాజరుకాగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక బూటకమే

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



ఉచిత ఇసుక పేరుతో బాబు చేసిన మోసాన్ని వివరిస్తున్న పేరాడ తిలక్

నందిగాం: ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు టన్నుకు రూ.340 నిర్ణయించి అమ్మడం బూటకపు హామీగా తేలిపోయిందని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం నందిగాం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పేరుతో భవన నిర్మాణ కార్మికులను వంచనకు గురి చేశారని మండిపడ్డారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా తల్లికి వందనం పథకం అమలు చేయలేదన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన సొమ్ములు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ సకాలంలో అందక రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకువచ్చే పరిస్థితి దాపురించిందన్నారు. జగనన్న పాలనలో రైతుల ఇంటి వద్దకు ఎరువులు, విత్తనాలు వచ్చేవని.. ఇప్పుడు క్యూలు కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకుండా శ్వేతపత్రాల పేరుతో జనాలకు పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల మేరకు ఉచితంగా ఇసుకను, పంటల బీమాను అందించాలని డిమాండ్ చేశారు.

రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ హస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్‌లో ఫార్మాసిస్టులు, ఫార్మసీ ఎయిడ్, సీఎస్ఏ, ఆడిట్ అసిస్టెంట్లు, వేర్‌హౌస్ హెల్పర్లు పోస్టుల ఖాళీలకు, ఇనోవ్ సోర్సెస్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచ్ రిలేటివ్ మేనేజర్, బ్రాంచి రిలేటివ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. మెడ్‌ప్లస్‌కు ఇంటర్, డిగ్రీ, బీ/డి/ఎం ఫార్మసీ పూర్తిచేసిన పురుష అభ్యర్థులు అర్హులుకాగా ఎంపికైనవారు పలాస, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇనోవ్ కంపెనీకి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన స్త్రీ/పురుషులు అర్హులని, ఎంపికైనవారు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూ.గో, ప.గో జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సుధ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని సౌభాగ్యలక్ష్మి నగర్‌లో వైద్య ఉద్యోగి గనగళ్ల రాంబాబుకు చెందిన ద్విచక్ర వాహనం(పల్సర్) చోరీకి గురైంది. రాత్రి ఇంటి బయట హ్యాండిల్ లాక్ వేసి పార్కింగ్ చేసి ఉంచగా ఉదయానికి కనిపించలేదు. వెంటనే రాంబాబు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అనంతరం నరసన్నపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

11న ఏఐబీడీపీఏ జిల్లా మహాసభలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని తిలక్‌నగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 11న ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీవోటీ పెన్షనర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా 4వ మహాసభలు జరగనున్నాయని సంఘ ప్రతినిధులు కె.గోపాలరావు, ఎం.గోవర్ధనరావు, రాజేశ్వరరావు, వెంకటరావు పాణిగ్రాహి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ప్రయివేటు టెలికాం కంపెనీలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సంస్థ 4జీ/5జీ సేవలు వేగవంతం చేయడానికి సిబ్బంది ఏవిధంగా పూర్తిస్థాయి సహాయ సహకారాలను అందించాలనే విషయంపై చర్చించనున్నామని పేర్కొన్నారు. అందరూ హాజరుకావాలని కోరారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల 2023– 24 బ్యాచ్ డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి విడుదల చేశారు. బీఏలో 93.00 శాతం, బీఎస్సీలో 71.37 శాతం, బీకాంలో 87.83 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ సీహెచ్ కాత్యాయని, అధ్యాపకులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

నందిగాం: మండలంలోని సైలాడ పంచాయతీ దేవాడకు చెందిన శతాధిక వృద్ధురాలు బొడ్డ సీతమ్మ (105) బుధవారం మృతి చెందింది. ఈమె భర్త రామన్న 35 ఏళ్ల కిందట చనిపోయారు. మొత్తం ఎనిమిది మంది సంతానంలో ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమారుడు ఉద్యోగ విరమణ చేసి ఇటీవలే మృతి చెందారు. మూడు రోజుల కిందట వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు.